


గోపాలరావును నేను కలుసుకొని చాలా సంవత్సరాలయింది. మే మిద్దరం ఒకటో ఫారంనుంచీ ఇంటర్మీడియేటు దాకా ఒకే బల్లమీద కూచుని చదివాము. ఆ తరువాత వాడి దారి వేరు, నా దారి వేరు అయింది.

హఠాత్తుగా మొన్న సెంట్రల్ స్టేషన్‌లో కనిపించాడు. ఎవరో స్నేహితుడు కలకత్తా మెయిలులో వూరికి వెడుతూ వుంటే, అతణ్ణి పంపించడానికి నేను స్టేషనుకి వెళ్లాను, అందమైన ఆడవాళ్ళు ఎవరైనా కనిపిస్తారేమో చూదామని. ఆఫీసు పని అయిపోగానే స్టేషనుకి వచ్చాడు గోపాలరావు.

''ఏమిరోయ్, ఎన్నాళ్ళ కెన్నాళ్లకు!'' అంటూ భుజం మీద చెయ్యివేసి నన్ను పలకరించాడు. చిన్ననాటి స్నేహితుడు కనిపిస్తే ఎవరికి ఆనందంగా వుండదు గనక! నేను చాలా ఆనందించాను. ఒకర్ని వొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నాము నా సంగతి అంతా వాడికి చెప్పాను. వాడు తన సంగతి అంతా చెప్పాడు. తాను సెంట్రల్‌కు యెందుకు వచ్చిందీ గోపాలరావు చెప్పినప్పుడు, నాకు ఆశ్చర్యం ఏమీ వెయ్యలేదు. చిన్నప్పటినుంచీ వాడి స్వభావం అంతే.

"అదిగో, ఆ ఆంగ్లో ఇండియన్ పిల్ల చూడరా! ఫస్టుక్లాస్ బాడీ'' అనీ, "అదిగో, అయ్యంగారి పిల్లచూడు, ఎంత షోగ్గా నడుస్తోందో!" అనీ మాటమాటకీ, ప్రతి పడుచునూ చూపిస్తూ గోపాలరావు తన్మయత్వం పొందుతూ ఉంటే, నేను కూడా కొద్దో గొప్పో ఆనందం పొందక పోలేదు.

గోపాలరావును మా యింటికి రమ్మన్నాను. వాడు సరేనన్నాడు. కలకత్తా మెయిలు వెళ్ళిన తరవాత యిద్దరమూ, మైలాపూర్ ట్రాము యెక్కడానికి వచ్చి, బ్రిడ్జిమీద నిలుచున్నాము నేను ట్రాము కోసం చూస్తున్నాను.

""ఒరేయ్, చూడారా. తెలుగు పిల్లలా ఉంది. అలా వుండాలి; మెడ్రాసులో వున్న తెనుగు పిల్లలంతా 'యీసురో దేవుడా' అంటూ వుంటారు కదా. అందానికి తగిన ఒడ్డు పొడుగు పొంకం కూడా అలా ఉండాలిరా" అని చిన్న లెక్చరుతో, మూర్ మార్కెటువైపు నుంచి వస్తున్న పద్ధెనిమిదేళ్ళ పిల్లను చూపించాడు గోపాలరావు,

చూశాను. ఆ పిల్లను చూడగానే నాకు కొద్దిగా నవ్వు వచ్చింది. నవ్వాను. ఆ

నవ్వుతో వచ్చి, మైలాపూర్ ట్రాం కోసమే మాకు కొంచెం దూరంలో నిలబడింది.

"నిమిషంలో కత్తు కలిపావులే వెళ్ళి మాట్లాడుకో. భలే ఛాన్సు. చాలా ఫార్వర్డు రకంలాగ వుంది, లేకపోతే, ఇట్టే నవ్వుతుందా!" అని నన్ను కొంచెం ప్రోత్సహించాడు గోపాలరావు!

నాకు ఏమి చెయ్యాలో తోచలేదు. కాని నవ్వు మాత్రం వచ్చింది.

ఆ పిల్లకేసి చూసి, మళ్ళీ నవ్వాను. నా నవ్వుకి, ఆ పిల్ల మళ్ళీ నవ్వింది. ఆ పిల్ల చాలా చక్కనిదే అని నా వుద్దేశం పైగా ఆ నవ్వులో ఎంతో తియ్యదనం ఉందని యిప్పటికీ అనుకుంటూ ఉంటాను. బహుశా, ఎప్పటికీ అనుకుంటానేమో కూడాను.

"అదృష్టవంతుడివిరా, ఛాన్సు కొట్టేశావ్. శుభస్యశీఘ్రం. వెళ్ళి మాటలు కలుపుకున్నావంటే, ఎటైనా లాక్కుపోవచ్చును–" అని నన్ను హుషార్ చెయ్యడం ఆరంభించాడు గోపాలరావు.

ఆ సందర్భంలో ఏం చెయ్యాలో నాకు తోచలేదు.

ఇంతలో నా బాధ కొంచెం సర్దటానికి భగవంతుడు తోడ్పడినట్టుగా ట్రాము వచ్చేసింది.

ఆపిల్ల ట్రాము యెక్కి, చివరవైపున లోపలికిపోయి కూచుంటే, సరిగ్గా ఆ మొహం చూడటానికి వీలుండదేమోనన్ని, చివర డ్రైవరు ప్లాట్‌ఫారం మీద నుంచుందామని నిర్బంధ పెట్టాడు గోపాలరావు.

అందుకు ఏమీ అభ్యంతరం పెట్టకుండా వొప్పుకున్నాను.

కండక్టరు టిక్కెట్లకోసం వచ్చాడు. ఆ పిల్ల దగ్గరకు వెళ్ళి అడిగాడు. నన్ను దగమని చూపించింది. నాకు నవ్వొచ్చింది. గోపాలరావు ఉద్రేకం పట్టరాకపోయింది

ఆ పిల్లకి, నాకూ, గోపాలరావుకి మూడు టిక్కెట్లు కొన్నాను.

"పిల్ల వలలో పడిందిరా. ఇంత ఈజీ అని నేను యెప్పుడూ అనుకోలేదు సుమా. తొణుకూ, బెణుకూ లేకుండా, నిన్ను చూపించేసిందే! మధ్య నే నెందుకు సత్రకాయలాగ? ఏ రాయపేటలోనే దిగిపోతాను. నువ్వా పిల్లను ఎగరేసుకుపో" అని ఉపాయం చెప్పాడు గోపాలరావు.

ఏమని జవాబు చెప్పడానికి నాకు తోచలేదు.

ఆ పిల్ల పక్కన చోటు మౌంటు రోడ్డులో ఖాళీ అయింది.

"వెళ్ళి ప్రక్కన కూచో, మంచి సమయం" అని నన్ను ముందుకు తోశాడు, గోపాలరావు. విధిలేక వెళ్ళి కూచున్నాను. వాడుకూడా, నా దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. వాడు రావడంతోనే ఆ పిల్ల కొంచెం సిగ్గుపడింది.

ఏం చెయ్యడానికీ తోచక, ఆ పిల్ల వైపు తిరిగి, "వీడు, నా స్నేహితుడు గోపాలరావు. రాత్రి మన యింట్లోనే భోజనం చేస్తాడు!" అనేశాను.

గోపాలరావు తెల్లబోయి నా వైపు చూశాడు. మా ఆవిడ మాత్రం సరేనన్నటు తల వూపింది.